సాక్షి
ఒడిశా

శుక్రవారం । 27 । జనవరి । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు
భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయంలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన హుండీ ఆదాయాన్ని ఆలయ పాలకవర్గం గురువారం లెక్కించారు. ఇందులో నగదు రూ.4,33,803లు, బంగారం 8.4 గ్రాములు, వెండి 11.8 గ్రాములు ఉన్నాయని అధికారులు వెల్లడించారు.



విభిన్నతకు పట్టం
- 8లో



భక్తిశ్రద్ధలతో వసంత పంచమి
- 8లో

న్యూస్‌రీల్

కోడలుకి పునర్వివాహం చేసిన మాజీ ఎమ్మెల్యే



నవ దంపతులు మధుస్మిత, శివ చందన్‌తో మాజీ ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు

భువనేశ్వర్: ఢెంకనాల్ మాజీ ఎమ్మెల్యే నవీన్ నందో తన కోడలుకి పునర్వివాహం చేసి, ఆదర్శాన్ని చాటుకున్నారు. అతని పెద్ద కుమారుడు సంబిత్ నందో 2021 మే 22న కరోనాతో మృతిచెందారు. చిన్న వయస్సులోనే భర్తను కోల్పోయిన అతని కోడలు మధుస్మిత వితంతువుగా మిగిలింది. వీరికి ఒక పాప కూడా ఉంది. ఈ నేపథ్యంలో కోడలు మధుస్మితకు రెండో వివాహం జరిపించారు. నవీన్, అతని వియ్యంకుడు(కోడలు తండ్రి) నీలమణి పండా దగ్గరుండి ఈ కార్యక్రమం నిర్వహించడం విశేషం. స్థానిక నయాపల్లి లక్ష్మీ దేవాలయంలో బాలేశ్వర్ జిల్లా రెముణా నివాసి దివంగత కిశోర్ చంద్రపతి కుమారుడు శివచందన్‌తో మధుస్మిత వివాహం జరిపించారు. జాతీయ బాలికా దినోత్సవం పురస్కరించుకుని ఈనెల 24న హిందూ సంప్రదాయం వివాహం నిరాడంబరంగా జరిపించినట్లు తెలిపారు. నవీన్ నందో భార్య రంజితా నందో, కోడలు మధుస్మిత సోదరులు సౌమ్య రంజన్, రష్మిరంజన్ హాజరై, నూతన వధూవరులను ఆశీర్వదించారు.

నకిలీ విదేశీ మద్యంతో వ్యక్తి అరెస్ట్



మద్యం బాటిళ్లతో పట్టుబడిన నిందితుడు

రాయగడ: అక్రమంగా నకిలీ విదేశీ మద్యాన్ని విక్రయిస్తున్న ఒక వ్యక్తిని ఎక్సైజ్ సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు. జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ అభిరాం బెహరా ఆదేశాల మేరకు పట్టణానికి సమీపంలోని దేవదోల గ్రామంలో సిబ్బంది గురువారం దాడులు నిర్వహించారు. ఇందులో 25 లీటర్ల నకిలీ విదేశీ మద్య పట్టుబడగా, దీనికి సంబంధించి జ్ఞానేంద్ర యాదవ్ అనే వ్యక్తిని అరెస్ట్ చేశామని తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసి, కోర్టుకు తరలించారు.

పేపర్‌లెస్ ఆటోమిషన్ సిస్టం ప్రారంభం



ఓస్‌వాస్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మంత్రి జగన్నాథ సరక

పర్లాకిమిడి: జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కాన్ఫరెన్స్ హాలులో పేపర్‌లెస్(ఒడిశా రాష్ట్ర వర్క్‌ఫ్లో ఆటోమేషన్ సిస్టం) ఓస్‌వాస్‌ను రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ వెనుకబడిన వర్గాల సంక్షేమ శాఖామంత్రి జగన్నాథ సరక కంప్యూటర్‌లో బటన్ నొక్కి ప్రారంభించారు. ఈ సాఫ్ట్‌వేర్ పద్ధతి ద్వారా అన్ని ప్రభుత్వ శాఖలకు అనుసంధానం చేస్తూ ఉత్తర ప్రత్యుత్తరాలు ఓస్‌వాస్ సిస్టం ద్వారా ఉద్యోగులు పని చేసుకోవచ్చని కలెక్టర్ లింగరాజ్ పండా తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ అధ్యక్షుడు గవర తిరుపతిరావు, ఏడీఎం సంగ్రాం శేఖర పండా, డిప్యూటీ కలెక్టర్(రెవెన్యూ) ప్రదీప్‌కుమార్ నాయక్ పాల్గొన్నారు.

18 మీటర్ల పతాక స్థూపం



జాతీయ పతాక స్థూపాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ లింగరాజ్ పండా

పర్లాకిమిడి: జిల్లా కేంద్రంలోని నీటి పారుదల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కార్యాలయం వద్ద 18 మీటర్ల ఎత్తయిన భారీ జాతీయ పతకా స్థూపాన్ని కలెక్టర్ లింగరాజ్ పండా గురువారం ప్రారంభించారు. ఇక్కడ 15 అడుగుల పొడుగు, 10 అడుగుల వెడల్పుతో ఉన్న జాతీయ పతకాన్ని ఎగుర వేశారు. కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ ప్రదీప్ కుమార్ నాయక్, డీఆర్‌డీఏ ఈఓ రమాంచల్ ఖమారి, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్(వంశధార, నాగవళి నదుల కో–ఆర్డినేటర్) నరేంద్రనాథ్ మహారాణా, ఏఈఈ సంజయ్‌కుమార్ రథో, జేఈ పి.జగన్నాథ్, సబ్ డివిజన్ జేఈ రోజారాణి పట్నాయక్, మోహిత్ ఆచార్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ చర్యలే హేతువు



జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న గవర్నర్ ప్రొఫెసర్ గణేషీలాల్

- రాష్ట్రస్థాయి 74వ గణతంత్ర దినోత్సవంలో గవర్నర్ గణేషీలాల్
- భువనేశ్వర్ మహాత్మాగాంధీ మార్గ్‌లో ఘనంగా వేడుకలు
- గౌరవ అతిథిగా హాజరైన సీఎం నవీన్ పట్నాయక్
- ఆకట్టుకున్న శకటాలు, పరేడ్, విద్యార్థుల ప్రదర్శనలు



బైక్‌పై విన్యాసాలు ప్రదర్శిస్తున్న డేర్ డెవిల్స్ బృందం



వేదికపై గవర్నర్, సీఎం నవీన్ పట్నాయక్ పరస్పర అభివాదం

భువనేశ్వర్: గత 2 దశాబ్దాలలో రాష్ట్రంలో గణనీయమైన మార్పులు చోటు చేసుకున్నాయని ఒడిశా గవర్నర్ ప్రొఫెసర్ గణేషీలాల్ తెలిపారు. రాష్ట్రాభివృద్ధికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలే దీనికి హేతువులని అభిప్రాయం వ్యక్తంచేశారు. రానున్న రోజుల్లో మరిన్ని పథకాలతో ప్రజా సంక్షమానికి అడుగులు వేయనున్నట్లు ప్రకటించారు. రాష్ట్ర రాజధాని నగరంలోని మహాత్మాగాంధీ మార్గ్‌లో గురువారం జరిగిన రాష్ట్రస్థాయి గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ముఖ్య అతిథిగా హాజరైన ఆయన.. జాతీయ పతాకాన్ని ఎగుర వేశారు. ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ గౌరవ అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కెసింగా ఎస్‌డీపీఓ ఎస్.ప్రతాప్ శ్రీమల్ సారథ్యంలో నిర్వహించిన పరేడ్‌లో గౌరవ వందనం స్వీకరించారు. ఈ పరేడ్‌లో ఆంధ్రప్రదేశ్ పోలీసు దళం గౌరవ పూర్వకంగా పాల్గొని, కవాతు నిర్వహించింది.


వీనుల విందు విన్యాసాలు

ఇందులో భాగంగా ప్రదర్శించిన వివిధ సంప్రదాయ నృత్యాలు, కార్యక్రమాలు అలరించాయి. గంజాం జిల్లా కబిసూర్య నగర్ బృందాలు ఘంటా మృదంగం సంగీతంతో ప్రదర్శించిన పశుముఖ నృత్యం, బౌద్ జిల్లాకు చెందిన కళాకారులు శబర్ సబరుణి నృత్యాలు ప్రేక్షకులను ఉర్రూతలూగించాయి. కలహండి జిల్లా భవానీపట్న కళాకారులు ప్రదర్శించిన బజాసల్, సింగారి, ఘుముసర నృత్యాలు, రాయగడ జిల్లాలోని ఆదిమ తెగల కళాకారుల ధిమ్సా నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అలాగే మోటార్ సైకిళ్లపై డేర్ డెవిల్ విన్యాసాలు, స్కేటింగ్ అకాడమీ బృందం స్కేటింగ్ విన్యాసాలు గగుర్పొడిచాయి. రెండేళ్ల అనంతరం కోవిడ్ ఆంక్షలు తొలగడంతో ఈ ఏడాది గణతంత్ర దినోత్సవం రాష్ట్రం అంతటా ఎటువంటి అడ్డంకులు లేకుండా జరుపుకొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా జరిగిన గణతంత్ర వేడుకలకు పాఠశాల, కళాశాల విద్యార్థులతో పాటు పెద్ద ఎత్తున ప్రజలు హాజరయ్యారు.

మిల్లెట్స్ మిషన్ శకటానికి..

తృణ ధాన్యాల వినియోగాన్ని ప్రోత్సహించేందుకు రాష్ట్రప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల్లో భాగంగా రాష్ట్రస్థాయి గణతంత్ర దినోత్సవ పరేడ్‌లో ప్రదర్శించిన ఒడిశా మిల్లెట్స్ మిషన్ శకటం ప్రథమ బహుమతి గెలుచుకుంది. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయం, ఆరోగ్య, కుటుంబ సంక్షేమం, విద్య, పంచాయతీరాజ్, తాగునీరు, నిర్మాణ శాఖ, చేనేత, జౌళి, హస్తకళలు, టూరిజం, ఒడిశా మైనింగ్ కార్పొరేషన్, అగ్నిమాపక దళం సహా తొమ్మిది కీలక శాఖల శకటాలు ప్రదర్శనలో పాల్గొన్నాయి.

సుదర్శన్ సైకత శుభాకాంక్షలు



గణతంత్ర దినోత్సవం పురస్కరించుకుని సైకత శిల్పి పద్మశ్రీ సుదర్శన్ పట్నాయక్ పూరీ సాగరతీరంలో అద్భుతమైన సైకత శిల్పాన్ని ఆవిష్కరించాడు. దేశాన్ని ప్రేమిద్దామనే నినాదంతో గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేయడం విశేషం.



గౌరవ కవాతు నిర్వహిస్తున్న పోలీసు ప్రత్యేక బలగాలు



ప్రథమ బహుమతి గెలుచుకున్న ఒడిశా మిల్లెట్స్ మిషన్ శకటం



చిన్నారుల స్కేటింగ్ విన్యాసాలు తిలకిస్తున్న గవర్నర్, ముఖ్యమంత్రి

'మా జీవితాలకు దారి చూపండి'



నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగుల కుటుంబ సభ్యులు

జయపురం: దేశమంతా గణతంత్ర దినోత్సవాలు ఘనంగా జరుపుకొంటున్న సమయంలో జయపురం గగణాపూర్ సేవా పేపరుమిల్లు శ్రామికుల కుటుంబ సభ్యులు ఆవేదనతో రోడ్డెక్కారు. పరిశ్రమలో పనిచేసి, మృతిచెందిన వారి భార్యలు కుటుంబ సభ్యులు స్థానిక బస్టాండ్ వద్ద గురువారం ప్లకార్డులు చేతపట్టి, ఆందోళనకు దిగారు. పేపరుమిల్లు మాజీ యజమాని గౌతమ థాపర్ రూ.100 కోట్లు అక్రమంగా దోచుకున్నారని, కర్మాగారంలో చెమటోడ్చి పనిచేసిన తమ భర్తల పీఎఫ్, పెన్షన్ బకాయిలు కాజేశారని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా అధికార యంత్రాంగం, ప్రజా ప్రతినిధులు తమకు న్యాయం చేకూర్చి, రాజ్యాంగం కల్పించిన హక్కులు పరిరక్షించాలని డిమాండ్ చేశారు. పేపరుమిల్లు యూనియన్ కార్యదర్శి ప్రమోద్‌కుమార్ మహంతి మాట్లాడుతూ మృతిచెందిన శ్రామిక కుటుంబాలకు చట్టపరంగా చెల్లించాల్సిన పింఛన్, పీఎఫ్ బకాయిలు చెల్లించాలని కోరారు. లేనిపక్షంలో ప్రజాందోళన చేపడతామని హెచ్చరించారు.

నవరంగపూర్ చేరుకున్న హత్తారే హాత్తో యాత్ర



నవరంగ్‌పూర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న పీసీసీ అధ్యక్షుడు శరత్ పట్నాయక్, కాంగ్రెస్ శ్రేణులు



ర్యాలీలో పాల్గొన్న జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్

కొరాపుట్: కాంగ్రెస్ జాతీయ నాయకుడు రాహుల్ గాంధీ చేస్తున్న భారత జోడో యాత్రకు మద్దతుగా పీసీసీ అధ్యక్షుడు శరత్ పట్నాయక్ చేస్తున్న హత్తారే హాత్తో జోడోయాత్ర నవరంగ్‌పూర్ జిల్లాలో గురువారం ప్రారంభమైంది. జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బహినీపతి శరత్ పట్నాయక్‌తో చేయి కలుపుతూ ముందుకు సాగారు. జిల్లా నలుమూలల నుంచి వేలాదిమంది తరలివచ్చిన కాంగ్రెస్ కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించారు. అక్కడి నుంచి జిల్లా సరిహద్దు ఇంద్రావతి నది దాటుతూ కొరాపుట్ జిల్లాలోకి ప్రవేశించి, జయపురం వైపు కొనసాగింది. కొరాపుట్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు మీనాక్షి బహినీపతి భారీ ఏర్పాట్లు చేశారు. కొరాపుట్ ఎంపీ సప్తగిరి ఉల్కా తన అనుచరులతో కొరాపుట్ చేరుకున్నారు. ర్యాలీలో డీసీసీ అధ్యక్షుడు మున్నా త్రిపాఠి, మాజీ ఎమ్మెల్యే భుజబల్ మాఝి, జిల్లా పరిషత్ సభ్యురాలు లిపికా మాఝి తదితరులు పాల్గొన్నారు.

జనజీవనం లోకి మావోయిస్టులు

- ఇంటెలిజెన్స్ డైరెక్టర్ ఎదుట మొహిపాదర్ దళ సభ్యుల లొంగుబాటు
- ముగ్గురిపైనా తలో రూ.లక్ష రివార్డు



జవాన్లు స్వాధీనం చేసుకున్న మావోయిస్టు డంప్‌తో జవాన్లు




లొంగిపోయిన మావోయిస్టులను అభినందిస్తున్న పోలీసు, బీఎస్ఎఫ్ ఉన్నతాధికారులు

మల్కన్‌గిరి: హింసాత్మక జీవనాన్ని వీడిన ముగ్గురు మావోయిస్టులు జనజీవన స్రవంతిలో అడుగు పెట్టారు. జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఇంటెలిజెన్స్ డైరెక్టర్ సంజీవ్ పండా సమక్షంలో గురువారం స్వచ్ఛందంగా లొంగిపోయారు. దళంలో చిన్నచూపు చూస్తున్నారని, ఇకపై జనంలోనే ఉంటూ ప్రశాంత జీవనం సాగిస్తున్నామని ప్రకటించారు. వీరిలో మనోజ్ అలియాస్ మతి మాఢి, కర్తాన్‌పల్లి పంచాయతీ పండు కవాసి, కర్మామి ఉన్నారు. ముగ్గురూ మత్తిలి సమితి మొహిపాదర్ దళంలో పని చేస్తున్నారు. చిన్న కేడర్ సభ్యులతో అమాయక గిరిజనులను హత్య చేయిస్తున్నారని, ఇది భరించలేక పోయామని వాపోయారు. ఈ సందర్భంగా ఇంటెలిజెన్స్ డైరెక్టర్ మాట్లాడుతూ లొంగిపోయిన మాజీ దళ సభ్యులు పలు హింసాత్మక ఘటనల్లో పాల్గొన్నారని, మందుపాతర అమర్చడం, ఎదురు కాల్పుల్లో పాల్గొన్నారని తెలిపారు. వీరిలో ఇద్దరు పురుషులు 2017లో, మహిళ 2022లో మావోయిస్టు దళంలో చేరినట్లు పేర్కొన్నారు. ఒక్కొక్కరిపై రూ.లక్ష చొప్పున రివార్డు ఉందని వెల్లడించారు. లొంగిపోయిన వారికి ప్రభుత్వం తరుపున అందాల్సిన సౌకర్యాలను త్వరలోనే అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మల్కన్‌గిరి ఎస్పీ నితీష్ వాధ్వనీ, కొరాపుట్ డీఐజీ రాకేష్ పండిత్, ఎస్‌బి డబ్ల్యూ డీఐజీ అనిరుధ్ సింగ్, ఆపరేషన్ ఏడీజీ అమితాబ్ ఠాకూర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

భారీ డంప్ స్వాధీనం

మల్కన్‌గిరి: జిల్లాలోని మత్తిలి సమితి కర్తన్‌పల్లి పంచాయతీ కిరిమిటి, కతూమ్‌పాదర్ గ్రామ అడవిలో జిల్లా పోలీసులు, ఎస్ఓజీ జవాన్లు సయుక్తంగా కూబింగ్ నిర్వహించారు. ఈ సమయంలో మావోయిస్టులకు చెందిన భారీ డంప్ బయట పడటంతో స్వాధీనం చేసుకున్నారు. దీనిని ఎస్పీ కార్యాలయానికి తరలించి, ఇంటెలిజెన్స్ డైరెక్టర్ సంజీవ్ పండా సమక్షంలో మీడియా ఎదుట ప్రదర్శించారు. ఇందులో 15 టిఫిన్ బాంబ్‌లు, ఐఈడీ బాంబులు, 10 జిలిటిన్ స్టిక్స్, గ్యాస్ సిలిండర్, 14 డిటోనేటర్లు, ఎస్ఎల్ఆర్ రైఫిల్–1, దేశవాలీ తుపాకీ, మూడు పిస్తోల్‌లు, 50 తూటాలు, మావోయిస్టు సాహిత్యం, దుస్తులు, మందులు, నిత్యావసర సామగ్రి ఉన్నారు. కార్యక్రమంలో పోలీసు, బీఎస్ఎఫ్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

పర్మాలిలో పోస్టర్ల కలకలం



మావోయిస్టులు విడిచిపెట్టిన కరపత్రాలు

రాయగడ: జిల్లాలోని కల్యాణ సింగుపూర్ సమితి పర్మాలిలో మావోయిస్టు పోస్టర్లు, కరపత్రాలు కలకలం సృష్టించారు. ఒకవైపు ఆడంబరంగా గణతంత్ర దినోత్సవ వేడుకల నిర్వహిస్తుండగా, అకస్మాతుగా వంశధార, నాగావళి, ఘుమసుర డివిజనల్ కమిటీ పేరిట పోస్టర్లు వెలియడంతో ఆందోళన చెలరేగింది. బూటకపు గణతంత్ర దినోత్సవాలను అంతా బహిష్కరించాలని వీటిలో పేర్కొన్నారు. ఆదివాసీల అభివృద్ధికి ప్రభుత్వం ప్రవేశ పెట్టిన డొంగ్రియా కొంధో డెవలప్‌మెంట్ ఏజెన్సీ(డీఏడీఏ), అలాగే ఒడిశా పీవీటీజీ ఎంపవర్‌మెంట్ అండ్ లైవ్లీహుడ్స్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాం(ఏపీఎల్‌పీ) పథకాల అమలులో నీరుగారాయని విమర్శించారు. ఇకనైనా ప్రజలకు స్వచ్ఛమైన పాలన అందించాలని, లేదంటే తప్పుకోవాలని డిమాండ్ చేశారు. ఇదిలా ఉండగా పర్మాలిలో గత కొద్ది నెలలుగా ఇటువంటి పోస్టర్లు తరచూ వెలుగు చూస్తుండటంతో డొంగ్రియా కొందొ గిరిజనులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

క్లుప్తంగా

జెడ్పీలో ఘనంగా గణతంత్ర దినోత్సవం



జిల్లా పరిషత్‌లో నిర్వహించిన గణతంత్ర దినోత్సవంలో జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, అధికారులు

విజయనగరం గంటస్తంభం: జిల్లా పరిషత్ కార్యాలయం ప్రాంగణంలో 74వ గణతంత్ర దినోత్సవం గురువారం ఘనంగా జరిగింది. కార్యక్రమంలో ముందుగా సీఈఓ ఎం.అశోక్ కుమార్ జాతీయ జెండాను ఆవిష్కరించగా.. జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, అధికారులు గౌరవ వందనం సమర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సంస్కృతిక కార్యక్రమాలు వీక్షించిన అనంతరం జిల్లా పరిషత్ చైర్ పర్సన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ..ఉమ్మడి జిల్లా ప్రజలందరికీ 74వ గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి ఒక్కరికి వివిధ సంక్షేమ పథకాలను అందిస్తూ వారి సామాజిక, ఆర్థిక అభివృద్ధికి తోడ్పడుతున్నారని గుర్తు చేశారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీ డిప్యూటీ సీఈఓ రాజకుమార్, డీపీఓ నిర్మలాదేవి జిల్లా పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

సైనిక్ స్కూల్లో రిపబ్లిక్ వేడుకలు



జాతీయ జెండాకు వందనం చేస్తున్న ప్రిన్సిపాల్ కులకర్ణి, తదితరులు

విజయనగరం రూరల్: కోరుకొండ సైనిక్ స్కూల్‌లో 74వ గణతంత్ర దిన వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కల్నల్ అరుణ్ ఎం.కులకర్ణి ముఖ్యఅతిథిగా పాల్గొని జాతీయపతాకావిష్కరణ గావించారు. ముందుగా ఆయన స్మారక స్థూపం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి యుద్ధవీరులకు నివాళులర్పించారు.అనంతరం 450 మంది ఎన్‌సీసీ క్యాడెట్‌లు పాల్గొన్న సెరిమోనియల్ పరేడ్‌ను సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయా తరగతుల్లో డ్రిల్‌లో ఉత్తమంగా నిలిచిన క్యాడెట్‌లకు అవార్డులను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష్మీనృసింహస్వామికి తమలపాకులతో అర్చన



లక్ష్మీనృసింహస్వామికి పూజలు చేస్తున్న అర్చకుడు శ్రీనివాసాచార్యులు

సీతానగరం: మండలకేంద్రంలోని సువర్ణముఖినది ఒడ్డున వేంచేసిన లక్ష్మీనృసింహస్వామిని తమలపాకులతో గురువారం అర్చించారు. ఆలయ ప్రదాన అర్చకుడు పి.శ్రీనివాసాచార్యులు మాట్లాడుతూ తమలపాకులు, తులసీదళాలు, పూలతో లక్ష్మీనృసింహస్వామివారిని అలంకరించి అర్చించినట్లు చెప్పారు. స్వామివారికి ప్రీతికరమైన గురువారం రోజున ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజలు నిర్వహించడం, మొక్కులు తీర్చుకోవడానికి భక్తులు రావడం ఆనవాయితీగా వస్తోందన్నారు. స్వామివారిని వేలాదిమంది భక్తులు దర్శించి ప్రత్యేక పూజలు చేశారని చెప్పారు. భక్తులు మాట్లాడుతూ స్వామివారిని పూజించడానికి దూర ప్రాంతాలనుంచి వచ్చామని తెలియజేశారు. పూజల్లో పాల్గొనే భక్తులందరికీ నిర్వాహకులు తీర్థప్రసాదాలు అందజేశారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ట



సీతారామలక్ష్మణ సమేత ఆంజనేయ విగ్రహాన్ని తీసుకువస్తున్న భక్తులు

పాలకొండ రూరల్: మండలంలోని అంపిలి గ్రామ రామాలయంలో సీతారామలక్ష్మణ సమేత ఆంజనేయ విగ్రహ ప్రతిష్ట గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అంతకుముందు అర్చకులు దార్లపూడి లక్ష్మీప్రసాద శర్మ, హరిచంద్ర పాడి నేతృత్వంలో కలశపూజ, పూర్ణాహుతి, గోపూజ, ప్రాణ ప్రతిష్ట చేసి, విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఈ కార్యక్రమం చూసేందుకు భక్తులు పోటీపడ్డారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

పాలకొండ రూరల్: ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని వాహనదారులకు ఎస్‌ఐ బి.శివప్రసాద్ సూచించారు. పాలకొండ-వీరఘట్టం రోడ్డులో పోలీసులు గురువారం వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా పరిమితికి మించి ప్రయాణికులతో అటువైపుగా వస్తున్న ఆటోను ఆపి, డ్రైవర్‌కు అపరాధ రుసుం విధించారు. అనంతరం ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పించారు. అధిక లోడు, పరిమితికి మించి ప్రయాణికులతో వాహనాలు నడపరాదని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, వాహనాలతో బయటకు వచ్చేటప్పుడు డ్రైవింగ్ లైసెన్స్, ఆర్‌సీ, సీ-బుక్‌లు, పొల్యూషన్ వంటి ధ్రువపత్రాలు వెంట తీసుకురావాలన్నారు.

ఘనంగా గణతంత్ర వేడుక



రాయగడ: ఆకట్టుకున్న విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు



జయపురం: కవాతు నిర్వహిస్తున్న వీడీ కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్లు

- జెండా ఎగుర వేసిన అధికారులు, ప్రజా ప్రతినిధులు
- రాజ్యాంగ స్ఫూర్తి, ఆవశ్యకతను వివరించిన వక్తలు

బరంపురం: రాష్ట్రవ్యాప్తంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. అధికారులు, ప్రజా ప్రతినిధులు, పాఠశాలలు, వివిధ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో జాతీయ జెండాను ఎగుర వేశారు. రాజ్యాంగ స్ఫూర్తి, ఆవశ్యకతను ఆహుతులకు వివరించారు. ఈ సందర్భంగా బరంపురం నగరంలోని ఖల్లికోట్ విశ్వ విద్యాలయం క్రీడా మైదానంలో దక్షిణాంచల్ ఆర్‌డీసీ టి.అపాంగ్ ఆవో, ఛత్రపూర్ పోలీసు రిజర్వ్ మైదానంలో కలెక్టర్ దివ్యజ్యోతి పరిఢా జాతీయ జెండా ఎగుర వేశారు. సబ్ కలెక్టర్ దిగంతా రౌత్రాయ్, కమిషనర్ సోనా జెనా, బరంపురం ఎస్పీ శరవణ్ వివేక్, ఎంపీ చంద్రశేఖర్ సాహు, ఎమ్మెల్యే విక్రమ్ పండా, నగర మేయర్ సంఘమిత్ర దొళాయి, ఏడీఎం.లీనా కేశరి పాల్గొన్నారు.

బరంపురం నగరంలోని పార్క్ వీధిలో ఫ్రెండ్స్ వెల్ఫేర్ క్లబ్, బాపూర్ బజార్‌లో ఎన్‌టీఆర్ సేవాసమితి, సంతపేట తెలుగు పాఠశాలలో మహాత్మాగాంధీ క్లబ్, ఆకుల వీధిలోని బరంపురం యాదవ సంఘం, లేడీస్ వాకర్స్ క్లబ్, నెహ్రూ నగర్‌లో వినియోగదారుల కోర్టు ప్రాంగణం, మెయిన్ రోడ్డులోని గాంధీ విగ్రహం వద్ద బీజేపీ నాయకులు, జిల్లా కాంగ్రెస్ కార్యాలయం, బీజేడీ కార్యాలయాల్లో గణతంత్ర దినోత్సవ వేడుకలు నిర్వహించారు.

జయపురం: పట్టణంలోని పరేడ్ గ్రౌండ్‌లో సబ్ కలెక్టర్ దేవధర్ ప్రధాన్, ఎమ్మెల్యే తారాప్రసాద్ బహినీపతి జయపురం కాంగ్రెస్ కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఎగుర వేశారు. విజేతలకు బహుమతులు అందించడంతో పాటు ఆస్పత్రిలో రోగులకు, సబ్ జైలులో ఖైదీలకు పండ్లు, మిఠాయి పంచిపెట్టారు.

కొరాపుట్: జిల్లా స్టేడియంలో రాష్ట్ర హోంశాఖ మంత్రి తుషార్‌కాంతి బెహరా, బీఎస్‌ఎఫ్ సెక్టార్ కార్యాలయంలో కమాండెంట్ విక్రమ్ సోలంకి, ఆంధ్రా-ఒడిశా వివాదాస్పద సరిహద్దు కొరాపుట్ జిల్లా పొట్టంగి సమితి కొఠియాలో సర్పంచ్ లియు గెమల్, రాష్ట్రంలో ఎత్తయిన పర్వతప్రాంతం దేవమాలిపై పారా రైడింగ్ పర్యాటకులు, నవరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలోని స్టేడియంలో కలెక్టర్ డాక్టర్ కమలోచన్ మిశ్రా, కాంగ్రెస్ కార్యాలయంలో రాష్ట్ర ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడు శరత్ పట్నాయక్ జెండా ఎగుర వేశారు.

రాయగడ: జిల్లా కేంద్రలోని గోవింద చంద్రదేవ్ ఉన్నత పాఠశాల మైదానంలో కలెక్టర్ స్వాధాదేవ్ సింగ్ జెండా ఎగుర వేశారు. ముందుగా పోలీస్, సీఆర్‌పీఎఫ్, ఎన్‌సీసీ, ఎయిర్‌వింగ్, వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ప్రదర్శించిన కవాతును స్వీకరించారు. జిల్లా ఎస్పీ వివేకానంద శర్మ, రాయగడ ఎమ్మెల్యే మకరంద ముదులి, మున్సిపాలిటీ చైర్మన్ మహేష్ పట్నాయక్, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

మల్కన్‌గిరి: జిల్లా కేంద్రంలో రాష్ట్ర రవాణా, జలవనరుల శాఖ మంత్రి టుకునీ సాహు జాతీయ జెండా ఎగర వేశారు. విద్యార్థుల పరేడ్, సాంస్కృతిక ప్రదర్శనలు తిలకించారు. ఉత్తమ సేవలందించిన సిబ్బందికి ప్రశంసాపత్రాలు అందించి, అభినందించారు. కార్యక్రమంలో కలెక్టర్ విశాల్‌సింగ్, ఎస్పీ నితీష్ వాధ్వనీ, మల్కన్‌గిరి ఎమ్మెల్యే ఆదిత్య మాఢి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ సోమారీ టంగులు, అదనపు కలెక్టర్ మహేశ్వర్‌చంద్ర నాయక్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పర్లాకిమిడి: జిల్లా కేంద్రంలోని గజపతి స్టేడియంలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, వెనుకబడిన వర్గాల అభివృద్ధి శాఖమంత్రి జగన్నాథ సరక జాతీయ జెండా ఎగుర వేశారు. కలెక్టర్ లింగరాజ్ పండా, ఏడీఎం సంగ్రాం శేఖర పండా, జిల్లా ఎస్పీ స్వాతి ఎస్.లక్రా, సబ్ కలెక్టర్ అలోక్ ప్రధాన్ పాల్గొన్నారు.

భువనేశ్వర్: ఖుర్దారోడ్ రైల్వే స్టేడియంలో డివిజన్ స్థాయి గణతంత్ర వేడుకల్లో తూర్పుకోస్తా రైల్వే జనరల్ మేనేజర్ మనోజ్ శర్మ, డివిజనల్ రైల్వే మేనేజర్ రింకేష్ రాయ్ జాతీయ పతాకం ఆవిష్కరించి, గౌరవ కవాతు స్వీకరించారు.



బరంపురం: గౌరవ వందనం స్వీకరిస్తున్న ఆర్‌డీసీ అపాంగ్ ఆవో



నేతాజీ వేషధారణలో ఆకట్టుకున్న చిన్నారి



పర్లాకిమిడి: జాతీయ జెండా ఎగురవేసి, ప్రసంగిస్తున్న మంత్రి జగన్నాథ సరక



కొరాపుట్: కొరియా పంచాయతీలో గణతంత్ర వేడుకలు



కొరాపుట్: ప్రత్యేక వాహనంలో గౌరవ వందనం స్వీకరిస్తున్న మంత్రి తుషార్ బెహరా



జయపురం: పారాబెడ పాఠశాలలో సబ్ కలక్టర్, అధికారులు



బరంపురం: పార్క్ వీధిలో జెండా ఎగుర వేస్తున్న ఫ్రెండ్స్ వెల్ఫేర్ క్లబ్ ప్రతినిధులు



రాయగడ: హాజరైన ఎమ్మెల్యే ముదులి, పట్టణ ప్రముఖులు



భువనేశ్వర్: గౌరవ కవాతు స్వీకరిస్తున్న ఈస్టుకోస్టు రైల్వే జీఎం మనోజ్ శర్మ



కొరాపుట్: ఉద్యోగులకు అవార్డులు అందిస్తున్న నవరంగ్‌పూర్ కలెక్టర్ కమలోచన్, ఎస్పీ సుశ్రీ



మల్కన్‌గిరి: పోలీసు సిబ్బందికి ప్రశంసాపత్రం అందిస్తున్న మంత్రి టుకునీ సాహు



మల్కన్‌గిరి: పరేడ్‌లో పాల్గొన్న పోలీసులు



పర్లాకిమిడి: కవాతు నిర్వహిస్తున్న ఏపీఆర్ పోలీసు దళాలు

విభిన్నతకు పట్టం

- రాష్ట్రం నుంచి నలుగురికి పద్మ పురస్కారాలు
- ప్రకటించిన కేంద్రప్రభుత్వం



సాహితీవేత్త అంతర్యామి మిశ్రా

భువనేశ్వర్: రాష్ట్రానికి చెందిన నలుగురు విశిష్ట వ్యక్తులు ప్రతిష్టాత్మక పద్మ పురస్కారాలకు ఎంపికయ్యారు. తోలు బొమ్మలాట కళాకారునిగా గుర్తింపు సాధించిన మగుణిచరణ్ కువార్, విద్య, సాహితీవేత్త డాక్టర్ అంతర్యామి మిశ్రా, జానపద గాయని కృష్ణ పటేల్, వ్యవసాయ రంగంలో విప్లవాత్మక ఆవిష్కరణలు చేపట్టిన గౌరవ్ పటాయత్ సాహు ఉన్నారని కేంద్రప్రభుత్వం బుధవారం ప్రకటించింది. ఈ సందర్భంగా వీరిని ప్రముఖులు, ప్రజలు అభినందించారు. డాక్టర్ అంతర్యామి మిశ్రా ప్రముఖ ఒడియా సాహితీవేత్త. ప్రఖ్యాత కాలమిస్ట్, పరిశోధకుడైన ఆయన.. గత 50 ఏళ్లుగా ఒడియా భాష, వ్యాకరణం, సంస్కృతి, చరిత్ర రంగాల్లో పలు అధ్యయనాలు, పరిశోధనలు చేశారు. మాతృభాషలో వ్యాసాలు, పుస్తక రచనల్లో ప్రత్యేకత సొంతం చేసుకున్నారు. ఒడియా సాహిత్య రంగంలో దాదాపు 30 పుస్తకాలను రచించారు. 2019లో శాస్త్రీయ ఒడియా భాష, పుస్తక రచనలో పరిశోధనకు ఆయనకు రాష్ట్రపతి పురస్కారం లభించింది. భాషావేత్తగా ఈ అవార్డును అందుకున్న మొదటి వ్యక్తిగా మిశ్రా నిలిచారు.

ప్రధాని మనసు దోచుకొని..

వివిధ ఔషధ మొక్కల పెంపకం, పోషణతో ప్రధానమంత్రి నరేంద్రమోదీ గత ఏడాది 'మన్ కీ బాత్' మనసు దోచుకున్నారు.. కలహండి జిల్లాకు చెందిన గౌరవ్ పట్టాయత్ సాహు. ప్రధాని నెలవారీ రేడియో కార్యక్రమం మన్ కీ బాత్ 81వ ఎపిసోడ్‌లో సహజ ఆరోగ్య సంరక్షణ ఉత్పత్తులను అభివృద్ధి చేయడంలో సాహు చేసిన కృషిని ప్రశంసించారు. కలహండి జిల్లా జునాగఢ్ మండలం నందోల్ గ్రామంలో ఔషధ మొక్కల పెంపకంలో విశేష గుర్తింపు పొందారు. ఎకరా విస్తీర్ణపు పెరటి తోటలో 3వేలకు పైగా ఔషధ మొక్కలు నాటి సంరక్షిస్తున్నారు. 65 ఏళ్ల వయస్సులో రసాయనాలు, ఎరువుల ప్రమేయం లేకుండా ఈ తోట నిర్వహించడం ప్రత్యేకత. దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల నుంచి అనేక ఆయుర్వేద ఔషధ మొక్కలు సేకరించి ఔషధ తోట నిర్వహిస్తున్నారు. గత 35ఏళ్లుగా పెంపకంలో తలమునకలై ఉన్నారు. వీటిని నాటడంతో పాటు ఆయుర్వేద మొక్కలపై అధ్యయనం చేసి అనేక పుస్తకాలను రచించారు. ఇందులో పండ్లు, పూలు, ఆకులతో రకరకాల మందులను తయారు చేసి చాలా మందికి ఉచితంగా మందులు ఇస్తున్నారు. దీంతో ప్రాంతీయులకు వైద్య మిత్రునిగా పేరొందారు. ఈ నేపథ్యంలో లఘు చిత్రం రూపొందించారు.



ధన్వంతరి గౌరవ్ పట్టాయత్ సాహు

రొంగొబొతి తెచ్చిన పురస్కారం..



రొంగొబొతి గాయని కృష్ణ పటేల్

ప్రముఖ సంబల్‌పురి జానపద గీతం రొంగొబొతి గాయని డాక్టర్ కృష్ణ పటేల్‌కు పద్మశ్రీ పురస్కారం ప్రకటించారు. ఆమె 500లకు పైగా శ్రోతల్ని కిర్రెక్కించే హుషారైన పాటలు ఆలపించడం విశేషం. 1957 నవంబర్ 28న సంబల్‌పూర్ జిల్లా కుచిండాలో జన్మించిన ఆమె.. పోలీస్ శాఖలో పని చేసి, ఉద్యోగ విరమణ పొందారు. జానపద కళల రంగానికి చేసిన కృషికి ఉత్తరాఖండ్ యూనివర్శిటీ ఆఫ్ కల్చర్ గతంలో గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది. రొంగొబొతి గేయ రచయిత మిత్రభాను గొంతియా, గాయకుల్లో ఒకరైన జితేంద్ర హరిపాల్‌కు ఇంతకుముందే పద్మశ్రీ లభించింది. 1970లో ఆమె పాడిన పాట తొలిసారిగా ఆకాశవాణి సంబలపూర్ కేంద్రం ప్రసారం చేసింది.



తోలు బొమ్మల కళాకారుడు..



తోలుబొమ్మల కళాకారుడు మగుణి కువార్

ప్రముఖ తోలుబొమ్మల కళాకారుడు మగుణి కువార్ ప్రతిష్టాత్మక పద్మశ్రీ అవార్డుకు ఎంపిక కావడం పట్ల ఆయన స్వస్థలమైన కెంజొహర్‌లో ఆనందం వెల్లివిరిసింది. ప్రాచీన తోలు బొమ్మలాటను కళగా ప్రోత్సహించి, భావి తరాలకు ఆదర్శంగా నిలిచారు. దీంతో ప్రతిష్టాత్మక పద్మ పురస్కారానికి యోగ్యత సొంతం చేసుకున్నారని సర్వత్రా ఆనందం వ్యక్తమైంది. 1937లో జన్మించిన మగుణి స్వస్థలంలో ఉత్కల్ విశ్వకర్మ కళాకుంజ్ కొండైనాచ్(తోలు బొమ్మలాట) సంస్థ నిర్వహిస్తున్నారు. 2004లో కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు, 2014లో రాష్ట్ర సంగీత నాటక అకాడమీ అవార్డు ఆయనకు లభించాయి. నార్త్ ఒడిశా విశ్వవిద్యాలయం పలుమార్లు సత్కరించి, గౌరవించింది. ఈ సందర్భంగా కెంజొహర్ నియోజకవర్గం ఎమ్మెల్యే మోహన్‌చరణ్ మాఝీ ఆయన నివాసానికి వెళ్లి మగుణి కువార్‌ను ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రేపటి తరానికి తోలు బొమ్మలాట కళను అభ్యసింప జేసేందుకు రాష్ట్రంలో అకాడమీ ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు.

నిత్య హరితం.. నవీనం



వందే ఉత్కల జననీ నినాదంతో శ్రీకృష్ణుని ప్రార్థిస్తున్న ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్



ఒడిశా-ఆన్ ది మూవ్ నినాదంతో ముందడుగు వేస్తున్న దృశ్యం

భువనేశ్వర్: ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఆకుపచ్చ రంగు జెర్సీ ధరించిన ఆయన.. నవ యవ్వనంతో ప్రత్యక్షం కావడం విశేషం. తెలుపు రంగు ప్యాంటు, ప్రత్యేక నినాదాలతో కూడిన ఆకుపచ్చ జెర్సీ ధరించి, అందరి దృష్టినీ ఆకట్టుకుంటున్నారు. ముందు భాగంలో 'ఒడిశా-ఆన్ ది మూవ్', వెనుకవైపు వందే ఉత్కల్ జననీ నినాదాలు చోటు చేసుకున్నాయి. నవీన్ నివాస్ ప్రాంగణంలో ముఖ్యమంత్రి తిరుగాడుతున్నట్లు రెండు ఫొటోలు, శ్రీ కృష్ణుని ప్రార్థిస్తున్నట్లు ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టాయి. ఈ గ్రీన్‌జెర్సీని రాష్ట్రప్రభుత్వం తన సావనీర్‌గా ఉపయోగించుకుంటుంది. గతంలో సోషల్ మీడియాలో ఓటింగ్ ద్వారా రాష్ట్ర క్రీడలకు ఆకుపచ్చ జెర్సీలను ఎంపిక చేశారు. బిజూ జనతాదళ్ పతాకం ఆకుపచ్చ రంగుతో కొనసాగుతుండటం గమనార్హం.

భక్తిశ్రద్ధలతో వసంత పంచమి



పూదలందుకుంటున్న సర్వస్వతీ దేవి



బాలసదన్ పాఠశాలలో చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న తల్లిదండ్రులు

పర్లాకిమిడి: వసంత పంచమి సందర్భంగా పట్టణంలో వివిధ విద్యాసంస్థలలో సరస్వతీ పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అంకా వీధిలోని బాలసదన్ ఇంగ్లీషు మీడియం పాఠశాలలో పలువురు తల్లిదండ్రులు తమ పిల్లలకు పండితులు జోస్యుల రవిప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో అక్షరాభ్యాసం చేయించారు. అలాగే సరస్వతీ శిశు విద్యామందిర్ సామూహిక అక్షరాభ్యాసాలు, సరస్వతీ పూజలు ఘనంగా చేపట్టారు. గుండిచా మందిరం శ్రీధవలేశ్వర మందిరం, గాయత్రీ మందిరంలో అక్షరాభాస్యాలు జరిపారు.

న్యూస్‌రీల్

ఉపాధి రంగంలో శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

కోటబొమ్మాళి: నిరుద్యోగులకు ఉపాధి రంగంలో పలు అంశాలకు సంబంధించి ఉచిత శిక్షణ పొందేందుకు ఈ నెల 30న రాజాంలో ఇంటర్వ్యూలు ఏర్పాటు చేసినట్లు నాగావళి స్వయం ఉపాధి శిక్షణ సంస్థ డైరెక్టర్ కె.శశిధర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎలక్ట్రికల్ హౌస్ వైరింగ్, కారు డ్రైవింగ్, మొబైల్ రిపేరింగ్, లేడీస్ టైలరింగ్, బ్యూటీ పార్లర్ మేనేజ్‌మెంట్ కోర్సుల్లో ఉచిత శిక్షణతో పాటు,ఉచిత హాస్టల్ సదుపాయాన్ని కల్పిస్తున్నట్లు తెలిపారు. పదో తరగతి పాసైన 18–40 మధ్య వయసు గల నిరుద్యోగులు విద్యార్హత, ఆధార్‌కార్డు, రేషన్ కార్డులతో ఇంటర్వ్యూకు హాజరు కావాలని, 9989953145 నంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

గిరి యాత్రకు 350 మందితో పోలీసు బందోబస్తు

గార: ఫిబ్రవరి 1 జరగనున్న శాలిహుండం గిరి యాత్రకు 350 మందితో పోలీసు బందోబస్తు ఉంటుందని ఎస్‌ఐ ఎం.మధుసూదనరావు తెలిపారు. యాత్ర ఏర్పాట్లపై గురువారం కొండపై ట్రస్టీ మధురెడ్డి, కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. యాత్ర ఏర్పాట్లపై ఎస్పీ జీఆర్ రాధిక ఆదేశాల మేరకు బందోబస్తు ఏర్పాటు జరిగిందన్నారు. రోప్ పార్టీలతో పాటు ట్రాఫిక్ పాయింట్లు, దేవాలయం, క్యూలైన్లు, ఘాట్ రోడ్డు వద్ద పాయింట్లను గుర్తించారు. ట్రస్టీ మధురెడ్డి మాట్లాడుతూ సాయంత్రం సమయంలో పోలీసులు లేకపోతే ఇబ్బందులు తప్పవని, దీనిపై చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో సుగ్గు లక్ష్మీనరసింహాదేవి, అచ్యుతరావు మాస్టారు తదితరులు పాల్గొన్నారు.

రథసప్తమి ప్రధాన ఉత్సవ అధికారిగా సురేష్‌బాబు



సీఎఫ్‌ఓ సురేష్‌బాబుకు ఆదిత్యుని జ్ఞాపికను అందజేస్తున్న ఈఓ హరిసూర్యప్రకాష్, శంకరశర్మ

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో రథసప్తమి ప్రధాన ఉత్సవ అధికారిగా, దేవదాయ శాఖ రీజనల్ జాయింట్ కమిషనర్ ఎంవీ సురేష్‌బాబును నియమిస్తూ దేవదాయ శాఖ కమిషనర్ జవహర్‌లాల్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 27 అర్ధరాత్రి నుంచి ప్రారంభం కానున్న రథసప్తమి ఉత్సవం 28వ తేది రాత్రి 10 గంటలతో ముగుస్తుంది. అంతవరకు ఉత్సవ నిర్వహణలో పర్యవేక్షణ బాధ్యతలన్నీ ఈయనే చూడాల్సి ఉంటుంది. తొలిసారిగా అరసవల్లి ఉత్సవానికి రీజనల్ జాయింట్ కమిషనర్ స్థాయి అధికారిని సీఈఓగా నియమించడం ప్రాధాన్యత సంతరించుకుంది.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

బొబ్బిలి: ఇటీవల మదర్సా వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన మండలంలోని గున్నతోటవలసకు చెందిన అల్లు శ్రీనివాసరావు(48) విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ బుధవారం అర్ధరాత్రి మృతిచెందాడు. ఈ మేరకు ఎస్‌ఐ చదలవాడ సత్యనారాయణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గున్నతోటవలసకు చెందిన అల్లు శ్రీనివాసరావు తన ఆటోలో గ్రామానికి చెందిన మరో ఇద్దరిని తీసుకుని ఈనెల 21న రైల్వేస్టేషన్‌కు వెళ్తుండగా, మదర్సా వద్ద రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో శ్రీనివాసరావు తీవ్రంగా గాయపడడంతో విశాఖ తరలించారు. మృతునికి భార్య దమయంతి, కుమార్తె, కుమారుడు భావన,మహేష్‌లు ఉన్నారు. మృతదేహానికి విశాఖలో పోస్టుమార్టం నిర్వహించి,కుటుంబసభ్యులకు అప్పగించారు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసామని ఎస్సై తెలిపారు.

అనుమానాస్పదరీతిలో కాలిన ఆటో



గొర్లెసీతారాంపురంలో కాలిన ఆటో

బొబ్బిలి రూరల్: మండలంలోని గొర్లెసీతారాంపురం గ్రా మంలో బుధవారం అర్ధరాత్రి దాటాక గ్రామానికి చెందిన జ లుమూరు సురేష్ ఆటో కాలిపోయింది. గ్రామంలోని ఎస్సీ కాలనీలో సురేష్ ఇంటి ముందర ఆటో పెట్టగా, అర్ధరాత్రి సమయంలో తన పక్కనే ఆటోకాలిపోతుండడం గమనించి,స్థానికులను అప్రమత్తం చేయగా,అప్పటికే ఆటో కాలిపోయింది. ఈమేరకు బాధితుడు సురేష్ పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశాడు. ఎవరో కాల్చేసినట్లు ఉందని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఫిర్యాదు మేరకు మేరకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

రాష్ట్ర స్కూల్‌గేమ్స్ పోటీల్లో సిక్కోలు విజయభేరి



రాష్ట్రపోటీల్లో విజేతగా నిలిచిన జిల్లా ఎస్‌జీఎఫ్ బాలుర వాలీబాల్ జట్టుతో కోచ్, మేనేజర్లు



స్కూల్‌గేమ్స్ రాష్ట్ర కబడ్డీ పోటీల్లో విజేతలుగా నిలిచిన జిల్లా బాలబాలికల కబడ్డీ జట్లు, కోచ్ మేనేజర్లు

శ్రీకాకుళం న్యూకాలనీ: స్కూల్‌గేమ్స్ రాష్ట్ర పోటీల్లో సిక్కోలు విజయ భేరి మోగించింది. రాష్ట్రస్థాయిలో జరిగే క్రీడాంశం ఏదైనా విజయం సిక్కోలుదే అన్నట్టుగా ఈ సీజన్ పరంపర సాగుతోంది. జిల్లా స్కూల్‌గేమ్స్ జట్ల రాణింపుపై ఎస్‌జీఎఫ్ అధ్యక్షులు,డీఈఓ గార పగడాలమ్మ, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ బీవీ రమణ, పీఈటీ సంఘ నాయకులు ఎంవీ రమణ, ఎం.సాంబమూర్తి, ఎస్.సూరిబాబు, పోలినాయుడు, గ్రిగ్స్ సెక్రటరీ కె.మాధవరావు, ఒలింపిక్ సంఘ జిల్లా కార్యదర్శి పి.సుందరరావు, డీఎస్‌ఏ అధికారులు, ఆయా క్రీడాసంఘాల నాయకులు, పీడీ,పీఈటీలు తదితరులు సంతోషం వ్యక్తంచేశారు.

కబడ్డీలో జయకేతనం

సిక్కోలు కబడ్డీ బాలబాలికల రెండు జట్లు జయ కేతనాన్ని ఎగుర వేశాయి. విజయనగరం జిల్లా నెల్లిమర్ల వేదికగా 66వ ఏపీ రాష్ట్ర స్కూల్‌గేమ్స్ అండర్-17 బాలబాలికల కబడ్డీ చాంపియన్‌షిప్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో సిక్కోలు బాలుర జట్టు ఆతిథ్య విజయనగరం జిల్లాపై 46–20 పాయింట్ల తేడాతో ఘన విజయం సాధించి విజేతగా నిలవగా, బాలికల జట్టు పటిష్టమైన కర్నూలు జిల్లాపై 53–51 పాయింట్ల తేడాతో గెలుపొంది చాంపియన్‌గా నిలిచింది. జిల్లా కబడ్డీ బృందానికి కోచ్ మేనేజర్లుగా పీడీలు ఎం.నీలాద్రి (బెజ్జిపురం), జె.నారాయణ (పల్లిసారథి) వ్యవహరించి జట్ల విజయంలో కీలక భూమిక పోషించారు.

వాలీబాల్‌లో విజయదుందుభి

జిల్లా బాలుర వాలీబాల్ జట్టు విజయదుందుభి మోగించింది. కర్నూలు వేదికగా ఈనెల 24 నుంచి 26వ తేదీ వరకు 66వ ఏపీ రాష్ట్ర స్కూల్‌గేమ్స్ అండర్-17 బాలబాలికల వాలీబాల్ చాంపియన్‌షిప్ పోటీలు జరిగాయి.

ఈ పోటీల్లో శ్రీకాకుళం బాలుర జట్టు చాంపియన్‌గా నిలిచింది. ఫైనల్ పోరులో పశ్చిమగోదావరి జిల్లాపై డైరెక్ట్‌గా 25–21, 25–19 రెండు సెట్లలో గెలుపొంది విజేతగా నిలిచింది. జిల్లా వాలీబాల్ బృందానికి కోచ్ మేనేజర్లుగా పీడీలు కె.భుజంగరావు (అల్లాడ), వై.తవిటినాయుడు (కందిస) వ్యవహరించారు.

ఎస్‌ఐ రాజేష్‌కు అరుదైన గౌరవం

రణస్థలం:

విధి నిర్వహణలో ఉత్తమ సేవలందించిన జె.ఆర్.పురం ఎస్సై గుంపక రాజేష్‌కు అరుదైన గౌరవం దక్కింది. 74వ గణతంత్ర వేడుకల సందర్భంగా ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా అన్‌సంగ్ హీరోస్ అవార్డు లభించింది. గుంటూరు జిల్లా అమరావతిలో వెల్లూర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(వీఐటీ-ఏపీ) యూనివర్సిటీలో జరిగిన వేడుకల్లో రాష్ట్రస్థాయి ఉన్నతాధికారి (ఐఎఫ్‌ఎస్) బి.సుందర్ బాలకృష్ణ చేతుల మీదుగా ప్రశంసాపత్రం, రూ. 25వేలు నగదు పురస్కారం అందుకున్నారు.



అవార్డు అందుకుంటున్న ఎస్సై రాజేష్

'యాత్రను విజయవంతం చేయండి'

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): జిల్లాలో జరగనున్న బహుజన రాజ్యాధికార చైతన్య యాత్రను జయప్రదం చేయాలని బహుజన సమాజ్ పార్టీ నాయకులు కోరారు. శ్రీకాకుళంలోని అంబేద్కర్ విజ్ఞాన్ మందిర్‌లో గురువారం కరపత్రాన్ని ఆవిష్కరించారు. బూర్జ మండలం కొల్లివలస నుంచి ఎచ్చెర్ల మండలం చిలకపాలెం వరకు యాత్ర జరగనుంది.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఇచ్ఛాపురం: పట్టణంలో గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు తీవ్ర గాయాలపాలయ్యారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బుడ్డెపు పేటకు చెందిన జామి నూకరాజు, పట్టణానికి చెందిన ప్రదీప్ గౌడోలు బైక్‌లపై వెళ్తూ పెట్రోల్ బంకు వద్ద ఎదురెదురుగా వచ్చి ఢీకొట్టుకున్నారు. ఘటనలో ఇద్దరికీ గాయాలయ్యాయి. స్థానికులు 108కు సమాచారం అందించి వీరిని ఆస్పత్రికి తరలించారు. అయితే పెద్ద దెబ్బలు తగలడంతో ప్రదీప్ గౌడోని బరంపురం, నూకరాజుని శ్రీకాకుళం తరలించారు. పట్టణ హెచ్‌సీ ఢిల్లేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఫ్లాట్‌ఫారంపై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

కాశీబుగ్గ:

పలాస జీఆర్పీ పరిధిలో ఉన్న రొతుపురం రైల్వే ఫ్లాట్‌ఫాం క్యాబిన్ గదిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం కనిపించిందని పలాస రైల్వే జీఆర్పీ స్టేషన్ ఎస్‌ఐ ఎస్‌కే షరీఫ్ తెలిపారు. సుమారు 50 ఏళ్లు ఉంటుందని, మృతదేహాన్ని పలాస ప్రభుత్వ సామాజిక ఆస్పత్రి మార్చురీలో ఉంచామని చెప్పారు. సమాచారం ఉన్న వారు పలాస జీఆర్పీ స్టేషన్‌కు 08945241101 నంబర్‌కు సంప్రదించాలని కోరారు.

సరస్వతీ నమస్తుభ్యం..!





జ్ఞానసరస్వతీ అమ్మవారి ఉత్సవ విగ్రహం, ఆలయంలో సామూహిక అక్షరాభ్యాసంలో పాల్గొన్న చిన్నారులు, తల్లిదండ్రులు

- జ్ఞానసరస్వతి ఆలయానికి పోటెత్తిన భక్తజనం
- సుమారు నాలుగువేల మంది చిన్నారులకు అక్షరాభ్యాసాలు
- అమ్మవారిని దర్శించుకున్న 50వేల మందికి పైగా భక్తులు

విజయనగరం టౌన్: వసంత పంచమి పర్వదినాన విజయనగరం జిల్లా కేంద్రంలోని జ్ఞానసరస్వతి ఆలయంలో అక్షర మంత్రం మారుమోగింది. వేలాదిమంది చిన్నారులు చదువుల తల్లి సాక్షిగా అక్షరాభ్యాసం చేశారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయం కిక్కిరిసిపోయింది. ధన్వంతరీ, సప్తమేధాగణపతి, లక్ష్మీ భువనేశ్వరీ సహిత జ్ఞాన సరస్వతీ అమ్మవారికి శారదాసేవా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు చెరుకూరి శ్రీధర్, గుడిశ శ్రీనివాసరావుల నేతృత్వంలో గురువారం వేకువజామునుంచి విశిష్ట పూజలు జరిపారు. ఉదయం 3.30 గంటల నుంచి సుప్రభాతసేవ, 4 గంటలకు ఆరాధన, 5 గంటలకు కుంకుమార్చనలు చేశారు. 6 గంటల నుంచి సాయంత్రం వరకూ గంటకు ఓ బ్యాచ్ చొప్పున సుమారు నాలుగువేల మంది చిన్నారులతో అక్షరాలు దిద్దించారు. ఉదయం నుంచి అమ్మవారిని సుమారు 50వేల మందికి పైగా భక్తులు దర్శించుకున్నారు.

భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ప్రాంగణంలోనే అల్పాహారం, భోజనం, చిన్నారులకు మంచినీరు, మజ్జిగ, పాలు తదితర వాటిని ఆలయ కమిటీ సమకూర్చింది. ఎక్కడికక్కడ సేవకులు భక్తులకు ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు చేపట్టారు. వసంతపంచమి సందర్భంగా వచ్చిన భక్తులతో రింగురోడ్డు ప్రాంతమంతా కిక్కిరిసిపోయింది. గంటకు పైగా ట్రాఫిక్ స్తంభించిపోయింది. టూటౌన్, ట్రాఫిక్ పోలీసులు సేవలందించారు.

న్యాయవ్యవస్థను ముందుకు తీసుకెళ్దాం



సమావేశంలో మాట్లాడుతున్న జస్టిస్ మన్మథరావు




జస్టిస్ మన్మథరావును సత్కరిస్తున్న దృశ్యం

- బాధిత ప్రజలకు న్యాయవ్యవస్థే దిక్కు
- హైకోర్టు జడ్జి, జస్టిస్ కె.మన్మథరావు

విజయనగరం లీగల్: న్యాయవ్యవస్థపై నమ్మకం పెంచుతూ... మరింత ముందుకు తీసుకెళ్లాల్సిన నైతిక బాధ్యత న్యాయవాదులదేనని హైకోర్టు జడ్జి, జస్టిస్ కె.మన్మథరావు పేర్కొన్నారు. జిల్లా కేంద్రానికి వచ్చిన ఆయన 74వ భారత గణతంత్ర దినోత్సవంలో పాల్గొన్నారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.కల్యాణచక్రవర్తితో కలిసి జాతీయ జెండాను ఎగురవేసి మహాత్మునికి ఘన నివాళులర్పించారు. అనంతరం జిల్లా న్యాయసేవా సదన్‌లో ఏర్పాటుచేసిన న్యాయవాదుల ఆత్మీయ సత్కారసభలో హైకోర్టు జడ్జి మాట్లాడారు. బాధిత పీడిత ప్రజలు న్యాయవ్యవస్థనే ఆశ్రయించడాన్ని మనందరం గుర్తించాలన్నారు. పెండింగ్ కేసులు పెరిగేందుకు రాష్ట్ర విభజన ఒక కారణమన్నారు. దీనిని నివారించాల్సిన బాధ్యత న్యాయమూర్తులు, న్యాయవాదులదేనన్నారు. సామాన్య ప్రజలకు సత్వర న్యాయం అందించగలిగిన నాడే న్యాయవ్యవస్థకు సరైన గుర్తింపు లభిస్తుందన్నారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.కల్యాణ్‌చక్రవర్తి మాట్లాడుతూ నేటి యువతలో దేశభక్తి కొరవడిందన్నారు. హక్కులకోసం పోరాడే ముందు బాధ్యతలను గుర్తెరగాలని సూచించారు. అనంతరం న్యాయమూర్తులు, న్యాయవాదులు జస్టిస్ మన్మథరావును జ్ఞాపికలు, దుశ్శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు కె.రాధారత్నం, షేక్ సికిందర్‌భాషా, జె.శ్రీనివాసరావు, రాష్ట్ర బార్‌కౌన్సిల్ మాజీ వైస్ చైర్మన్ కోలగట్ల తమ్మన్నశెట్టి, న్యాయవాదుల సంఘ ప్రతినిధులు బండారు సంజీవరావు, వై.హరికృష్ణ, బి.భాస్కరరావు, కె.చిన అప్పారావునాయుడు పాల్గొన్నారు.

ఆంధ్రా జట్టు ఘనవిజయం

- అస్సాం జట్టుపై ఇన్నింగ్స్ 95 పరుగుల తేడాతో గెలుపు
- మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచిన రాయుడు



విజయం సాధించిన ఆంధ్రా జట్టు, (ఇన్‌సెట్లో) మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు సొంతం చేసుకున్న రాయుడు

విజయనగరం: జిల్లా వేదికగా జరిగిన రంజీ క్రికెట్ మ్యాచ్‌లో ఆంధ్రా క్రికెట్ జట్టు ఘన విజయం సాధించింది. డెంకాడ మండలం చింతలవలసలో గల డాక్టర్ పీవీజీ రాజు ఏసీఏ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఆవరణలో మూడు రోజులుగా జరుగుతున్న మ్యాచ్‌లో అస్సాం జట్టుపై ఇన్నింగ్స్ 95 పరుగుల తేడాతో ఆంధ్రా జట్టు గెలుపొందింది. టెస్ట్ మ్యాచ్ తరహాలో నాలుగు రోజుల పాటు జరగాల్సిన మ్యాచ్‌ను అద్భుత ఆల్‌రౌండర్ ప్రతిభతో ఆంధ్రా జట్టు మూడు రోజులకే ముగించగా..రెండు ఇన్నింగ్‌ల్సలో ఏడు వికెట్లు పడగొట్టిన రాయుడు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు. 23 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 62 పరుగుల ఓవర్‌నైట్ స్కోరు వద్ద గురువారం మూడవ రోజు రెండవ ఇన్నింగ్స్ ప్రారంభించిన అస్సాం జట్టు 54.1 ఓవర్లలో 153 పరుగులకే ఆలౌటైంది. ఆంధ్రా బౌలర్‌లు లలిత్ మోహన్ 40 పరుగులిచ్చి 5 వికెట్లు దక్కించుకోగా..షోయాబ్ మహ్మద్‌ఖాన్ 30 పరుగులిచ్చి 2 వికెట్లు, ఎం రాయుడు 34 పరుగులిచ్చి 2 వికెట్లు చేజిక్కించుకుని అస్సాం బ్యాట్స్‌మెన్‌ను పెవిలియన్ బాట పట్టించారు. దీంతో ఆంధ్రా జట్టు మరో ఇన్నింగ్స్ మిగిలి ఉండగానే 95 పరుగుల తేడాతో విజయం సాధించింది. అంతకు ముందు ఆంధ్రా జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 112 ఓవర్లలో 361 పరుగులు చేయగా..అస్సాం జట్టు 37.5 ఓవర్లలో 113 పరుగులు చేశారు.

కూచిపూడిలో బాలికకు ఐసీఎండీఏ ధ్రువీకరణ పత్రం



కూచిపూడి నృత్యంలో ప్రతిభ కనబర్చి ఐసీఎండీఏ సర్టిఫికెట్‌ను, మెడల్‌ను సాధించిన ఆయుషి మహంతి

కంచిలి: కూచిపూడి నృత్యంలో అద్భుత ప్రతిభ కనబర్చుతున్న కంచిలికి చెందిన పన్నెండేళ్ల బాలిక ఆయుషి మహంతి ఐ.సి.ఎం.డి.ఎ (ది ఇంటర్నేషనల్ కర్నాటిక్ మ్యూజిషియన్స్ అండ్ డ్యాన్సర్స్ అసోసియేషన్) నుంచి ధ్రువీకరణ పత్రాన్ని పొందింది. ఈ బాలిక ఆంధ్ర, ఒడిషా రాష్ట్రాల పరిధిలో వివిధ స్టేజ్ షోల్లో ప్రదర్శనలు ఇచ్చి అందరి మనస్సులు పొందింది. ఇందులో భాగంగా ఐసీఎండీఏ పిలుపు మేరకు గత ఏడాది డిసెంబర్ 17న విశాఖపట్నంలో నిర్వహించిన సంగీత నృత్య మహోత్సవ్ పోటీల్లో పాల్గొంది. ఇక్కడ ఐగిరి నందిని స్తోత్రంకు కూచిపూడి నృత్యాన్ని అద్భుతంగా ప్రదర్శించింది. దీనికిగాను మెచ్చుకొని ఇంటర్నేషనల్‌కు చెందిన ఆ సంస్థవారు బాలిక ఆయుషి మహంతికి పార్టిసిపేషన్ సర్టిఫికెట్‌తో పాటు మెడల్‌ను పంపారు. ఈ బాలిక తల్లిదండ్రులు అభిమన్యు మహంతి కాంట్రాక్టర్, తల్లి ఉమాపాత్రో జెడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. తమ చిన్నారి కూచిపూడి నృత్యంలో ఇంతటి ఘనత సాధించడంపై వారు హర్షం వ్యక్తం చేశారు.

ఆనందపురం.. పోటెత్తిన భక్తజనం



వంద అడుగుల వెంకటసాయి మహాస్తూపం వద్ద భక్తులు

జి.సిగడాం: మండలంలోని ఆనందపురంలో జరుగుతున్న షిరిడీ సాయిబాబా, వంద అడుగుల వెంకట సాయికోటి మహాస్తూపం 21వ వార్షికోత్సవాలు గురువారం వైభవంగా ముగిశాయి. సాయి నామస్మరణతో గ్రామమంతా మారుమోగింది. స్థానికులతో పాటు ఉత్తరాంధ్ర జిల్లాలు, హైదరాబాద్ వంటి సుదూర ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. గురువులు అమ్ముల సాంబశివరావు ఆధ్వర్యంలో రెండు కోట్ల సాయినామ పుస్తకాలను భక్తులకు అందజేశారు. పూజా కార్యక్రమంలో ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్, ఆలయ నిర్మాత మక్క వెంకటసాయి, మాజీ ఎమ్మెల్యే మీసాల నీలకంఠంనాయుడు, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిన్నింటి సాయికుమార్, బూరాడ వెంకటరమణ కమల కుమారి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్విజ్ పోటీల విజేత డెంకాడ

కంచిలి: మండలంలో గోకర్ణపురం గ్రామంలో రిపబ్లిక్ దినోత్సవం సందర్భంగా గురువారం ప్రతి ఏడాది మాదిరిగానే ఈ ఏడాది రాష్ట్రస్థాయి క్విజ్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతగా విజయనగరం జిల్లా డెంకాడకు చెందిన శివ టీమ్, రన్నర్‌గా కవిటి మండలం లండారిపుట్టుగకు చెందిన శ్రీ విజయదుర్గా టీమ్, మూడో స్థానంలో కవిటికి చెందిన శ్రీనివాసరావు టీమ్ దక్కించుకున్నాయి. ఈ పోటీల్లో మొత్తంగా 50టీంలు పాల్గొన్నాయి. ఇందులో ప్రాథమికంగా నిర్వహించిన పోటీలో పది టీమ్‌లు ఎంపికచేశారు. వీరితో క్విజ్ పోటీలు నిర్వహించారు. ఇందులో మూడు స్థానాల్లో పైన పేర్కొన్న టీమ్‌లు నిలిచాయి. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎఫ్‌ఎస్ చైర్మన్ సునీల్ మహంతి, వాసుదేవ్, స్థానిక సర్పంచ్ యారడి ఆనందరావు, వార్డు మెంబర్ కడగల లోకేశ్వరరావు, నిర్వాహకులైన యువకులు పాల్గొన్నారు.

నేటి నుంచి రాష్ట్ర స్థాయి కబడ్డీ, ఖోఖో పోటీలు

- రాజీవ్ క్రీడామైదానంలో రెండు రోజుల పాటు నిర్వహణ
- పాల్గొననున్న 10 కబడ్డీ జట్లు, 8 ఖోఖో జట్లు

విజయనగరం: జిల్లా కేంద్రం విజయనగరం వేదికగా రెండు రోజుల పాటు జరగనున్న ఆహ్వానపు కబడ్డీ, ఖోఖో పోటీలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. కబడ్డీ, ఖోఖో పితామహుడు స్వర్గీయ వై భగవాన్ దాస్ వద్ద శిక్షణ పొందిన ఖోఖో క్రీడాకారుడు ఎన్ఆర్‌ఐ కేకే కుమార్ ఆధ్వర్యంలో నగరంలోని రాజీవ్ క్రీడామైదానం వేదికగా ఈ రెండు క్రీడాంశాల్లో పోటీలు జరగనున్నాయి. ఈ పోటీల్లో ఖోఖో క్రీడాంశంలో విజయనగరం, విశాఖ, శ్రీకాకుళం, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కృష్ణ, ప్రకాశం, నెల్లూరు జట్లు పాల్గొననుండగా..కబడ్డీలో ఉత్తరాంధ్ర జిల్లాలైన విజయనగరం, విశాఖపట్నం, శ్రీకాకుళం జిల్లాల నుంచి 10 జట్లు ప్రాతినిధ్యం వహించనున్నాయి.

ఈ రెండు క్రీడాంశాల్లో విజేతలుగా నిలిచిన మొదటి జట్టు రూ.30వేలు, ద్వితీయ స్థానం దక్కించుకున్న జట్టు రూ.20వేలు, తృతీయ,నాల్గవ స్థానాలు దక్కించుకున్న జట్లుకు రూ.15వేలు చొప్పున నగదు ప్రోత్సాహకాలు బహూకరిస్తామని నిర్వాహకులు ప్రకటించారు. పోటీలను లీగ్ కమ్ నాకౌట్ పద్ధతిలో నిర్వహించనుండడంతో జిల్లా ఖోఖో, కబడ్డీ అసోసియేషన్ ప్రతినిధులు ఇప్పటికే మైదానాలు సైతం ఖరారు చేసి సిద్ధం చేశారు. అంతేకాకుండా హాజరవుతున్న క్రీడాకారులకు అవసరమైన భోజన, వసతి సదుపాయాలను కల్పించినట్లు నిర్వాహకులు తెలిపారు.

పరిమళించిన మానవత్వం



రంగనాథస్వామి ఆలయంలో వివాహం జరిపిస్తున్న మొయిద సోదరులు

- పేద యువతిని ఓ 'ఇంటిదాన్ని' చేసిన అన్నదమ్ములు
- గ్రామస్తులు,బంధువుల కళ్లలో ఆనందబాష్పాలు

రేగిడి: ఆ వివాహానికి వచ్చినవారందరి కళ్లల్లో ఆనందబాష్పాలు రాలాయి. వధువు మెడలో వరుడు తాళి కడుతున్న సమయంలో అక్కడ ఉన్నవారంతా కల్యాణ కర్తలైన ఇద్దరు అన్నదమ్ములను ఘనంగా ప్రశంసించారు. ఈ అపురూప ఘట్టం మండలంలోని వావిలవలస గ్రామంలో గురువారం జరిగింది. 15 ఏళ్ల క్రితం గ్రామానికి చెందిన కొయ్యాన లక్ష్మి..తన తల్లిదండ్రులైన చిన్నారావు, మంగమ్మలను కోల్పోయింది. ఆమె తోబుట్టువు నాగమణికి వివాహమై అత్తారింటికి వెళ్లిపోయింది. అప్పటినుంచి లక్ష్మికి తామున్నామంటూ భరోసా ఇచ్చిన మిధునం సినీ నిర్మాత మొయిద ఆనందరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు, గ్రామ సర్పంచ్ మొయిద ప్రసన్నలక్ష్మి, శ్రీనివాసరావులు ఆమె బాగోగుల విషయంలో చేదోడు వాదోడుగా ఉంటూ వచ్చారు. లక్ష్మికి పెళ్లి వయస్సు రావడంతో వివాహం చేయాలని భావించిన తడవుగా అదే గ్రామానికి చెందిన కర్రి శ్రీనివాసరావుతో సంబంధం కుదిర్చారు. మంచి ముహూర్తం కావడంతో గురువారం గ్రామంలోని రంగనాథస్వామి ఆలయంలో వేద మంత్రాల సాక్షిగా ఆ జంటను ఒక్కటి చేసి తమ గొప్ప మనసును చాటుకున్నారు. అంతే కాకుండా పూరింటిలో ఉంటున్న లక్ష్మికి తల్లిదండ్రుల మాదిరిగా అంతా తామై చక్కటి ఇంటిని నిర్మించారు. తనకు తల్లిదండ్రులు లేకపోయినప్పటికీ దేవుడు తన ఇద్దరు అన్నయ్యలు ఇచ్చాడంటూ పెండ్లి కుమార్తె లక్ష్మి మెరిసే కళ్లతో సంతోషం వెలిబుచ్చింది. ఈ కార్యక్రమానికి పంచాయతీ సభ్యులు, గ్రామస్తులు హాజరై అక్షింతలు వేసి ఆశీర్వదించారు. అనంతరం బంధుమిత్రులకు భోజనాలు ఏర్పాటు చేశారు. గ్రామ పురోహితులు పులఖండం ప్రసాదరావు, పీసపాటి సంపత్‌కుమార్‌ల ఆధ్వర్యంలో ఈ వివాహ వేడుక ఘనంగా జరిగింది.

వ్యాకులమాత యాత్ర



మాట్లాడుతున్న విచారణకర్త గొంగాడ రాజు

కొత్తవలస రూరల్: వ్యాకులమాత యాత్ర ఈ నెల 27న నవదిన పూజలతో ప్రారంభమవుతుందని ఫాదర్ గొంగాడ రాజు తెలిపారు. స్థానిక విలేకరుతో ఆయన గురువారం మాట్లాడుతూ ఫిబ్రవరి 4వ తేదీన జ్ఞానాపురం నుంచి మహా పాదయాత్ర గురుశ్రీ జొన్నాడ జాన్‌ప్రకాష్ ఆధ్వర్యంలో సాగుతుందన్నారు. ఫిబ్రవరి 5న వ్యాకులమాత యాత్ర జరుగుతుందని తెలిపారు. గాజువాక, సింహాచలం డిపోల నుంచి ప్రత్యేక బస్సుసర్వీసులు నడుస్తాయన్నారు.

అంబేడ్కర్ ఆదర్శప్రాయుడు

- ఎమ్మెల్యే రెడ్డి శాంతి

కొత్తూరు: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలను యువత కొనసాగించాలని ఎమ్మెల్యే రెడ్డి శాంతి పిలుపునిచ్చారు. స్థానిక రెవెన్యూ కార్యాలయం ఆవరణలో ఎమ్మెల్యే రెడ్డి శాంతి భర్త నాగభూషణరావు జ్ఞాపకార్థం అంబేడ్కర్, మ హాత్మా గాంధీ విగ్రహాలను గురువారం ఆవి ష్కరించారు. అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం ప్రపంచంలోనే గొప్పదని అన్నారు. అంబేడ్కర్ చొరవతోనే నేడు మహిళలు చట్టసభలతోపాటు పలు రంగాల్లో పురుషులతో సమానంగా హ క్కులు పొందుతున్నారన్నారు. అంబేడ్కర్ విగ్ర హ దాతలైన కొత్తూరు జెడ్పీటీసీ కామక భాగ్యవతి, వైఎస్సార్‌సీపీ నాయకుడు కామక త్రినాథరావు, కామక దాలయ్యను పలువురు అభి నందించారు. అలాగే వసంతి పంచమి సందర్భంగా సర్వసతిదేవి చిత్రపటానికి ఎమ్మెల్యే పూలమాల వేశారు. ఈ సందర్భంగా పేద మహిళలకు చీరలు, విద్యార్థులకు బహుమతు లు అందజేశారు.